ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
బుధవారం 28 మే 2025 హైదరాబాద్ 5

# హత్య కేసులో రౌడీ షీటర్ అరెస్టు

- ప్రోత్సహించిన తల్లిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కత్తి, సెల్‌ఫోన్ స్వాధీనం
- పాత నేరస్తులు తరచూ నేరాలకు పాల్పడితే ఉపేక్షించం
- రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బీ గితే



**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పరిధిలోని మహిళా హత్య కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మహేశ్ బీ గితే మంగళవారం వెల్లడించారు. చందుర్తి మండలానికి చెందిన బొల్లు మల్లవ్వ (57) అనే మహిళకు అదే గ్రామానికి చెందిన బొల్లు మనోజ్ కుటుంబానికి గత కొంతకాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఎలాగైనా మల్లవ్వను అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశ్యంతో మనోజ్ తన తల్లి మోహినవ్వా ప్రోత్సాహంతో మనోజ్ సోమవారం సాయంత్రం వ్యవసాయ పనులు పూర్తిచేసుకొని ఇంటికి వెళ్తుండగా మల్లవ్వపై పెద్దమ్మ గుడి సమీపంలో కత్తితో దాడికి పాల్పడి హత్య చేశాడు. అనంతరం చందుర్తి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ కేసులో పోలీసులు హత్య చేసిన బొల్లు మనోజ్‌తో పాటు అతనితల్లి మోహినవ్వాలపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని మంగళవారం రిమాండ్‌కి తరలించినట్లు చెప్పారు. ఇదిలాఉంటే నిందితుడు మనోజ్ 2023లో హత్య కేసులో, దొంగతనం, బెదిరింపులకు పాల్పడిన కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. గతంలోనూ రెండు కేసుల్లో జువైనల్ హోమ్, మరో రెండు కేసుల్లో రిమాండ్ చేసినట్లు ఎస్పీ చెప్పారు. వీటిని దృష్టిలో పెట్టుకొని 2024లో రౌడి షీట్ ఓపెన్ చేసి నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పలుమార్లు చందుర్తి పోలీస్ వారి ఆధ్వర్యంలో సత్ప్రవర్తనతో మెలగాలని కౌన్సెలింగ్ కూడి ఇచ్చినట్లు తెలిపారు. పై కేసులు కోర్టులో ట్రయల్‌లో ఉన్నందున నిందితుడికి శిక్ష పడే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాత కేసుల్లో నిందితులుగా ఉండి.. తరుచూ నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయాభ్రాంతులకు గురిచేసే వారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో రౌడీషీటర్స్‌పై నిరంతరం నిఘా కఠినతరం చేయడం చేస్తామని తెలిపారు.

# దర్గావళి గుట్టపై అక్రమ నిర్మాణ వివాదం

- దర్గాకు అనుబంధంగా నిర్మించిన షెడ్డు కూల్చివేసిన రెవెన్యూ అధికారులు
- అక్రమ కట్టడ పరిశీలనకు వెళ్లిన బీజేపీ శ్రేణులు
- గ్రామస్తులకు, బీజేపీ నేతలకు మధ్య వివాదం
- జిల్లా అధ్యక్షుడు గోపీతో సహా నేతల అరెస్టు
- ఎల్లారెడ్డిపేటలో ఉద్రిక్తత





**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని దర్గావళి గుట్టపై దర్గాకు అనుబంధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడం వివాదాస్పదంగా మారింది. ఈ కట్టడాన్ని బిజెపి శ్రేణులు కూల్చివేస్తారన్న సమాచారం మేరకు మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులు సిబ్బందితో కలిసి కూల్చివేశారు. బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో గుట్టను పరిశీలించేందుకు వెళ్లనున్న సమాచారంతో గ్రామ మాజీ సర్పంచ్ మల్లేశం బీజేపీ శ్రేణులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామ శివారులోనే బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. గోపీతో సహా బిజెపి నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీస్ స్టేషన్ వద్దకు బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. దర్గావళి గుట్ట వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఈ సందర్భంగా గోపీ మీడియాతో మాట్లాడారు. సింగారం గ్రామంలోని దర్గావళి గుట్టపై సర్వే నెం. 365 లోని 40 ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేస్తూ మతపరమైన నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శించారు. సింగారం గుట్టపై కాకతీయుల చోళుల నాటి ఆనవాళ్లు ఉన్నాయని, వాటిని చెరిపేసే విధంగా కొందరు రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ, అటవీ శాఖ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ పాల్గొనడం సిగ్గుచేటని విమర్శించారు. ఎమ్మెల్యేగా పదేళ్ల కాలంలో దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, అక్రమార్కులకు అండగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు అంతగా కోరిక ఉంటే తన జన్వాడ ఫాంహౌస్ లో ఇలాంటి మతపరమైన నిర్మాణాలు కట్టుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగారం గుట్టను 5వేల మందితో పరిశీలనకు వెళ్తానని, త్వరలో తేదీని వెల్లడిస్తామని చెప్పారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ అరెస్టుపై జిల్లాలోని బీజేపీ నాయకులు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ కు తరలివచ్చారు. మాజీ సర్పంచ్ మల్లేశంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## వైద్యారోగ్య శాఖలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలో వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పలు పోస్టులు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేసేందుకు మంగళవారం ఇంటర్వ్యూలు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన నిర్వహించారు. ఇదివరకే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా, ఔట్ సోర్సింగ్ ప్రాతిపాదికన 4 మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 1 అభ్యర్థి, కాంట్రాక్టు ప్రాతిపదికన 1 ల్యాబ్ మేనేజర్ పోస్టులకు 6 అభ్యర్థులు, 5 ఎం.ఎల్.హెచ్.పి. పోస్టులకు 11 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూల్లో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.రజిత, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# వేములవాడ నియోజకవర్గానికి మరో గిటు రాయి

- విప్ చొరవతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ క్లాంపెక్స్ మంజూరు
- విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు
- విద్యార్థులు, ప్రజల హర్షం

**ప్రజానావ, వేములవాడ:** రాష్ట్రంలోని పేద, బడుగు,బలహీన, సామన్య, మధ్యతరగతి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మాణం చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ నియోజకవర్గానికి 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లడుతూ ప్రభుత్వం నిర్మాణం చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల మాదిరిగా దేశంలో ప్రైవేటు విద్యా సంస్థలు కూడా ఉండవన్నారు. సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో అద్భుతమైన క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, అందులో విద్యా బోధన చేసే ఉపాధ్యాయులకు కూడా అక్కడే వసతి కల్పించడానికి గృహ సముదాయాన్ని నిర్మిస్తామన్నారు. విద్యార్థులకు అన్ని వసతులతో పాటు సాంకేతికంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజిటల్ విద్యా బోధన చేయడానికి డిజైన్ ఉంటుదని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు కావలసిన ల్యాబ్స్, లైబ్రరీ తో పాటు మినీయాప్ థియేటర్ కూడా ఉండేలా డిజైన్ చేసిన ఈ రెసిడెన్షియల్ పాఠశాలలు పేద, బడుగు, బలహీనవర్గాల,కుటుంబాలకు, ప్రయివేటు విద్యాసంస్థల్లో లక్షలకు లక్షల రూపాయల ఫీజులు చెల్లించలేని వారికి ఉపయోగపడుతాయన్నారు. ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా సిలబస్‌ను కూడా రూపొందిస్తున్నట్టు చెప్పారు. పేద, బడుగు బలహీన వర్గాలకు మేలు చేయాలనేదే ముఖ్యమంత్రి ఆలోచన అని, ఆ దిశగా పని చేస్తున్నామని పేర్కొన్నారు.



## పిడుగుపాటుకు గొర్ల కాపరి మృతి





**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మణ్ (26) అనే యువ గొర్లకాపారి మంగళవారం చోటు చేసుకున్న పిడుగుపాటు ఘటనలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి గ్రామ శివారులో జరిగింది. లక్ష్మణ్ తలపైన పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో ఒక్కసారిగా కుప్పకూలి, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్టు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. స్థానికులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ సిబ్బంది మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణ్‌ది నిరుపేద కుటుంబం కావడంతో ఆ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఇలాంటి ఘటనలు జరిగే ప్రమాదం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## దొంగతనం కేసులో నిందితునికి జైలు, జరిమానా

**ప్రజానావ, సిరిసిల్ల:** దొంగతనం కేసుల్లో నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.వంద జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పువెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సిరిసిల్ల పట్టణం సాయి నగర్‌కి చెందిన అన్నాల్ దాస్ శ్రీనివాస్ అనే వ్యక్తి తన తండ్రి మరణించడంతో సొంత గ్రామం కొదురుపాకకి 2020 డిసెంబర్ 28న భార్య పిల్లలతో కలిసి వెళ్లాడు. అన్ని కార్యక్రమాలు జరిగిన తర్వాత మధ్యలో 2021 జనవరి 1న మొబైల్ ఛార్జర్ అవసరం ఉండడంతో తన మామ ఆయిన గుజ్జేటి శంకర్ వెళ్లి ఛార్జర్ తీసుకురామన్నాడు. శంకర్ ఎప్పటిలాగే ఇంటికెళ్లి ఛార్జర్ తీసుకొని తాళం వేసి వచ్చాడు. తిరిగి అన్నాల్ దాస్ కుటుంబ సభ్యులంతా సాయి నగర్‌లో తన ఇంటికి వెళ్లి చూడగా మెయిన్ గేటు తాళం అలాగే ఉండగా.. లోపల డోర్ తాళం పగలగొట్టి కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా బెడ్ రూమ్ లో బీరువా తలుపులు తెరిచి బట్టల చిందర వందరగా పడి ఉన్నాయి. అందులో ఉన్న 8 గ్రాముల బంగారు చైను, పావు తులం ఉంగరం, ఐదు తులాల వెండి చైను కనపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేసును దర్యాప్తు చేసిన ఎస్ఐ సుధాకర్ సిద్దిపేటకు చెందిన నిందితుడు కిమ్మసారం సురేశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలిమల సందీప్ వాదించగా సీఎంఎస్ ఆర్ఎస్ఐ శ్రావణ్ ద్వారా, కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.వంద జరిమానా విధించినట్లు సిరిసిల్ల సీఐ తెలిపారు.


## బాధితులకు అండగా ఉంటాం

### సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన పంబాల భూమయ్య అనే వ్యక్తి గతంలో కరెంటు షాక్ తో మృతి చెందగా సెస్ ద్వారా తన కుటుంబానికి మంజూరైన రూ.5లక్షల చెక్కును మృతుడి భార్య అనితకు సెస్ వైస్ చెర్మన్ దేవరకొండ తిరుపతి అందజేశారు. ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో మృతి చెందిన బాధిత కుటుంబాలకు సెస్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ ప్రతినిధులు బైరాగోని మల్లయ్య షేక్ రహీమ్, సెస్ ఏఈ దివ్య, మాజీ సర్పంచ్ కేంద గంగాధర్, తిరుపతి, యుసాఫ్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌ఘాతంతో పాడి గేదెలు మృతి



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరా వుపేట మండలం ని మ్మపల్లి గ్రామానికి చెం దిన రైతు కూస చిన్న రామిరెడ్డికి చెందిన రెండు పాడి గేదేలు పొలంలో గడ్డిమేస్తుండగా అంతకుముందే కరెంట్ పోల్‌పై ఉన్న విద్యుత్ వైర్ తెగిపడిపోయి అక్కడే వున్నా గేదెలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు లక్ష రూపాయల విలువైన పాడి గేదెలను నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ షాక్ తో మృతి చెందిన పాడి గేదె రైతును ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కదిరే శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

